



19వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక సూర్య


www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 12 మార్చి 2026 పేజీలు 8


# ప్రజలందరికి చేరువగా..

## సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు



**ప్రతీ మూడు నెలలకూ పాలనా అంశాలపై సమీక్ష చేసుకోవాలి**

**ఉన్న పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన బ్యాలెన్సు**

**జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు**





**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికి చేరువ చేసి వారు ప్రయోజనం పొందేలా కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర రాజధాని అమరావతిలోని రాష్ట్ర సచివాలయం 5వ బ్లాక్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన 6వ కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, శాఖలధిపతులు, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో పాటు పలువురు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. తొలి రోజు కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాలు, స్వచ్ఛాంధ్ర, జీఎస్డీపీ లక్ష్యాలు, జిల్లాల్లో విజయవంతమైన కార్యక్రమాలపై సమీక్షించారు. 2

---

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



వివరాలు 7లో

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలి



వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించండి

డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని

వివరాలు 8లో...




### మహిళా సమస్యల పరిష్కారమే

# అజెండాగా జన్ సున్వాయ్

**వేగవంతంగా, పారదర్శకంగా సమస్యల పరిష్కారానికి చొరవ**

**రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ**

**విజయవాడ, మార్చి 11, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జాతీయ మహిళా కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని గోపాల్ రెడ్డి రోడ్డులోగల జల వనరుల నిర్వహణ, సమగ్ర రైతు శిక్షణ కేంద్రంలో ఉమ్మడి కృష్ణాజిల్లా (ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు) నుంచి వచ్చిన మహిళల ఫిర్యాదుల విచారణతో పాటు కొత్త ఫిర్యాదులను స్వీకరించి విచారించారు. అనంతరం మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..... 9వ తేదీన నెల్లూరు జిల్లాలో జన్ సున్వాయ్ కార్యక్రమాన్ని మొదలుపెట్టామన్నారు. ఈనెల 13వ తేదీ విశాఖపట్నంతో జన్ సున్వాయ్ కార్యక్రమం మొదటి దశ పూర్తవుతుందన్నారు. ఇప్పటినుంచి ప్రతి జిల్లాలో మహిళా సమస్యలపై జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. మహిళా సమస్యల పరిష్కారమే అజెండాగా వేగవంతంగా, పారదర్శకంగా సమస్యలను అధికారులతో కలిసి పరిష్కరిస్తామన్నారు. విచారణ అధికారుల పనితీరుపై బాధితులు అసంతృప్తి చెందితే వారి స్థానంలో మరో అధికారిని నియమించాలని జిల్లా ఎస్పీలకు సూచిస్తామన్నారు. జన్ సున్వాయ్ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని పెండింగ్ కేసుల విచారణతో మిగతా 2లో...

# 13న సీఎం పర్యటన

**సూరంపల్లి వేదికగా 'అన్నదాత సుఖీభవ' మూడో విడత నిధులను విడుదల చేయనున్న సీఎం**

**సూరంపల్లిలో సభా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జిల్లా అధికారులు**



**గన్నవరం, మార్చి 11, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 13న కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత నిధులను పీఎం - కిసాన్ నిధులతో కలిపి గన్నవరం మండలం సూరంపల్లి గ్రామం నుండి విడుదల చేయనున్నారు. ఈ సభకు మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)

### మహిళా సమస్యల పరిష్కారమే

## అజెండాగా జన్ సున్వాయ్

పాటు కొత్త కంప్లైంట్ లు కూడా రావడం ఇందుకు నిదర్శనమన్నారు. మహిళా జన్ సున్వాయ్ లో ఎక్కువగా గృహహింస, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, మోసపూరిత వివాహాలు, డొమెస్టిక్ వైలెన్స్, వంటి కేసులు ఎక్కువగా మహిళా కమిషన్ దృష్టికి వచ్చాయన్నారు. మహిళా సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలబడి పోరాటం చేయటానికి మహిళా కమిషన్ సిద్ధమన్నారు. న్యాయవాదులను పెట్టుకోలేని వారికోసం న్యాయవాదులను నియమించి వారికి న్యాయ సహాయం కూడా చేస్తామన్నారు. మహిళలను ఇబ్బందులకు గురి చేసే ఏ ఒక్కరిని విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ పూజిత, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, డిపిఓ జ్యోతి, ఏసీపీలు వెంకటేశ్వరరావు, ప్రసాదరావు, దుర్గారావులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎం సహాయనిధి

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** సింగ్ నగర్ లోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ విప్, నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు 59వ డివిజన్‌లకు చెందిన పలువురు లబ్ధిదారులకు మొత్తం రూ.4,82,097 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూవిజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజల నుండి వచ్చే ప్రతి సమస్యకు, ప్రతి అర్జీకి జవాబుదారీతనంతో స్పందిస్తూ తాము, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమానికి అనేక అర్జీలు వస్తున్నాయని, ప్రతి అర్జీని కూడా బాధ్యతగా స్వీకరించి పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అలాగే ఎమ్మెల్యే కార్యాలయానికి ముఖ్యమంత్రి సహాయనిధి కోసం అందిన అర్జీలను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు మా డివిజన్ పార్టీ నాయకుల సమక్షంలో చెక్కులు అందజేస్తున్నామని, దీనివల్ల పేద, బలహీన వర్గాల ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని, లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గత 20 నెలల కాలంలో కోట్ల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసి వారి కుటుంబాలకు అండగా నిలిచామని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గౌరవంగా స్వీకరించి వారికి సహాయం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. తమకు అధికారం అనేది అలంకారం కాదు, బాధ్యతగా భావించి ప్రజల సేవలో నిరంతరం పనిచేస్తున్నామని, పార్టీ నాయకులందరూ కూడా అదే విధంగా కృషి చేస్తున్నారని, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపగలగడం తమకు ఎంతో సంతోషంగా ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు మరక శ్రీనివాస్ యాదవ్, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి షేక్ గౌసియా, డివిజన్ పార్టీ అధ్యక్షులు రాజాన బంగారు నాయుడు, ప్రధాన కార్యదర్శి బోదాల సురేష్, షేక్ ఫర్వీన్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్గపురిలో మరమ్మతులన్నీ త్వరగా పరిష్కరించాలి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** స్వర్గపురిలో మరమ్మతులన్నీ త్వరగా పరిష్కరించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణలంక, రాణి తోట ప్రాంతాలన్ని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని స్వర్గపురి అన్నిటిలో ఎటువంటి మరమ్మతులు ఉండరాదని, అక్కడ ఎటువంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరించి అన్ని వసతులు పూర్తి స్థాయిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. కృష్ణలంక నేతాజీ బ్రిడ్జి వద్ద ఉన్న వర్టికల్ గార్డెను అభివృద్ధి చేయాలని, అందంగా ఉంచుకుంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఉన్నారు. ఏపీఎస్ఆర్ఎం అన్న క్యాంటీన్ పరిశీలించి అన్న క్యాంటీన్లో ఎటువంటి సమస్య ఉండరాదని నోడల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాల నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికి చేరువగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు




(మొదటిపేజీ తరువాయి)

పీపీపీ ప్రాజెక్టులు, ఆర్టీజీఎస్, సుపరిపాలనలో సాంకేతికత, పెట్టుబడులు, వైద్యారోగ్యం, సూపర్ సిక్స్ పథకాలపై చర్చించారు. వివిధ అంశాలపై ముఖ్యమంత్రి లక్ష్యాలను నిర్దేశించి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విషయమై ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం కల్పించేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు ఈ మేరకు అధికారులు - ప్రజాప్రతినిధులు కలిసి చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి. కార్యాచరణ ప్రణాళిక ప్రకటించారు. వ్యవసాయానికి ప్రోత్సహమిచ్చేలా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అనే వ్యవస్థను ఏర్పాటు చేస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇండియన్ బిజినెస్ స్కూల్ తరహాలో వ్యవసాయం కోసం అత్యున్నత సంస్థ ఏర్పాటు చేద్దామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ప్రతీ మూడు నెలలకూ పాలనా అంశాలపై సమీక్ష చేసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. ఉన్న పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్సు చేస్తున్నామన్నారు. గతంలో కార్యాలయాల్లో కూర్చుని ఫైల్స్ రాసే పరిస్థితి నుంచి వర్చువల్ పనివిధానాన్ని తీసుకువచ్చామన్నారు. గడచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయని, వీటి అమలులో ఉదాసీనత వద్దన్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా తీసుకువచ్చిన 10 సూత్రాలు అమలు చేస్తే సుపరిపాలన అందించేందుకు వీలవుతుందన్నారు. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలన్నారు. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా దొర్లకుండా పారదర్శకంగా అమలు చేయాలన్నారు.. 13 తేదీన అన్నదాత సుఖీభవ పథకాన్ని మూడో విడత అమలు చేస్తున్నామన్నారు. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్ము వేస్తుందన్నారు. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సమర్ధంగా తీసుకెళ్దామన్నారు. ఖరీఫ్ సాగు కోసం మే 15 తేదీన నీటిని విడుదల చేస్తున్నామన్నారు.సీజన్లో ముందుగానే నీరు ఇస్తామన్నారు.




ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్దిదారులకు సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు. ఇంద్ర ధనస్సు పేరిట దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు అమలు చేస్తున్నామన్నారు గత పాలనలో ట్రూ అప్ పేరిట విద్యుత్ చార్జీల భారం వేశారు. తొలిసారి ట్రూ డౌన్ చేసామన్నారు. 4600 కోట్ల రూపాయల భారాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఈ ఏడాది 39 పైసల మేర విద్యుత్ కొనుగోలు ధర తగ్గిస్తామన్నారు. కుసుమ్ కింద 3 లక్షల పంప్ సెట్లు ఇస్తున్నామన్నారు. సబ్ స్టేషన్ యూనిట్ గా మైక్రో గ్రిడ్ ఏర్పాటుతో పాటు ప్రోజ్యూమర్ కాన్సెప్టును సమర్ధంగా అమలు చేయాలన్నారు. వ్యవసాయానికి ప్రొత్సహిమిద్దాం..ఐటీ, ఏఐ, క్వాంటం ల్యాబ్స్ తరహాలో వ్యవసాయం కోసం ఓ బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అనే వ్యవస్థను ఏర్పాటు చేద్దామన్నారు మచిలీపట్నం నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ చంద్రశేఖర రావు, విజిలెన్స్ అధికారి పిజిఆర్ఎస్ నోడల్ అధికారి పోతురాజు, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, మత్స్యశాఖ జే డీ అయ్యా నాగరాజా, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజేంద్ర బాబు, డిఎస్ఓ మోహన్ బాబు, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, ఆర్టీసీ పిఓ గోపాల్, జిల్లా ఉపాధి కల్పనాధికారి బ్రహ్మం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# 13న గన్నవరంలో సీఎం పర్యటన

(మొదటిపేజీ తరువాయి)



సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, జాయింట్ కలెక్టర్ నవీన్ , జిల్లా ఎస్పీ విద్యా సాగర్, ఎంఆర్ఓ శివయ్య ఇతర జిల్లా అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పని చేసి ఎటువంటి లోటు జరగకుండా చూడాలని సూచించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో సభకు వచ్చే వారికీ మంచినీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అస్సాం లోని గౌహతిలో ప్రధానమంత్రి కిసాన్ నిధులను విడుదల చేసిన అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు గన్నవరం మండలం సూరంపల్లి వేదికగా రాష్ట్రంలోని 46.80 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 2,808 కోట్లు నేరుగా జమ చేస్తారని తెలిపారు. రైతులకు కేంద్రం ఇచ్చే రూ. 2,000 లకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 4,000 కలిపి మొత్తం రూ. 6,000లను ఈ విడతలో అందజేస్తోందని వివరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గన్నవరం వేదికగానే చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసారని అన్నారు. గతంలో కేంద్ర మంత్రి అమిత్ షాతో కలిసి చంద్రబాబు ఎన్డీఆర్ఎఫ్ భవన ప్రారంభోత్సవానికి ఇక్క డికే వచ్చారని యార్లగడ్డ గుర్తుచేశారు. ఇప్పుడు మూడో విడత నిధుల విడుదల కోసం మళ్ళీ సూరంపల్లి గ్రామా నికి రావడం యాదృచ్ఛికమని, ఇది నియోజకవర్గ ప్రజల అదృష్టమని ఆయన పేర్కొన్నారు. గతంలో మొదటి విడత ప్రకాశం జిల్లా దర్శిలో, రెండో విడత కడప జిల్లా కమలా పురంలో జరగ్గా, ఇప్పుడు మూడో విడత కృష్ణా జిల్లా గన్నవరంలో జరగనుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం కోసం భారీ నిధు లు కేటాయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలపడానికి రైతులందరూ భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమ విజయవంతం కోసం నీటి సం ఘాల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, పాల కేంద్రాల ప్రతి నిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలుకుతామని కార్యక్ర మాన్ని దిగ్విజయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యట నలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, డిఎంహెచ్ఓ డాక్టర్ యుగంధ ర్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సతీ ష్, ఆర్టీవో ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాసరావు, జిల్లా అగ్ని మాపక అధికారి ఏసురత్నం, డీఎస్ఓ మోహన్ బాబు, డిపిఓ అరుణ, ఆర్ అండ్ బి ఈఈ లోకేష్ డి.ఎస్.పి శ్రీనివాసరావుతదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను వసూళ్ల పరిశీలన

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** గుడివాడ డి డి ఓ సునీతా శర్మ, ఎంపీడీవో ఎండి ఇమ్రాన్తో కలిసి మండలంలోని డికిపర్రు గ్రామాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న హౌస్ ట్యాక్స్ వసూళ్లను పరిశీలించి, పెండింగ్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి హౌస్ ట్యాక్స్ వసూళ్లు ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. అనంతరం వారు డోకిపర్రు జడ్పి హైస్కూల్‌ను సందర్శించి, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. రాబోయే పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు సమయాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ పాఠాలను పునర్విమర్శ చేయాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విజయకీలాద్రి ఆలయంలో దేశంలోనే ఎత్తయిన ఉక్కుతలుపులు

## తయారు చేసిన ఆక్సెస్ టఫ్ డోర్స్ సంస్థ





**విజయవాడ మార్చి 11, మేజర్ న్యూస్ :** విజయవాడ సమీపంలోని విజయకీలాద్రిపై ఉన్న శ్రీ విఘ్నువిమోచక హనుమాన్ ఆలయంలో దేశంలోనే ఎత్తయిన ఉక్కు తలుపులు ఏర్పాటు చేశారు. సుమారు 40 అడుగుల ఎత్తుతో రూపొందించిన ఈ భారీ తలుపులను హైదరాబాద్‌కు చెందిన 'ఆక్సెస్ టఫ్ డోర్స్' సంస్థ ఇంజినీరింగ్ చేసి తయారు చేసింది. దాదాపు 1.4 టన్నుల బలమైన నిర్మాణ ఉక్కుతో ఈ తలుపులను నిర్మించారు. రెండు వైపులా స్లైడ్ అయ్యే డబుల్ షట్టర్ వ్యవస్థతో పాటు రిమోట్ కంట్రోల్ ఆటోమేషన్ సాంకేతికతను ఇందులో అమర్చారు. దీని వల్ల భారీ పరిమాణంలో ఉన్నప్పటికీ తలుపులు సులభంగా, సురక్షితంగా తెరుచుకునేలా రూపొందించారు. కృష్ణానది తీరాన ఉన్న విజయకీలాద్రిపై జరుగుతున్న పూజ్య శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలోని మహా ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాలలో భాగంగా ఈ తలుపులను ఏర్పాటు చేయడం విశేషం. ఈ కార్యక్రమాలకు వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఈ తలుపులను హైదరాబాద్‌లో రూపకల్పన చేసి తయారు చేసి, అనంతరం విజయకీలాద్రికి తరలించి ఆలయంలో అమర్చారు. ఆధునిక ఇంజినీరింగ్ నైపుణ్యంతో పాటు సంప్రదాయ ఆలయ నిర్మాణ శైలిని సమన్వయం చేస్తూ ఈ తలుపులను రూపొందించారు. ఈ ప్రాజెక్టును ఆక్సెస్ టఫ్ డోర్స్ సంస్థ సీఈఓ శారీఖ్ అబ్దుల్ నాయకత్వంలో అమలు చేశారు. ఆయన మాట్లాడుతూ, "శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఈ బాధ్యతను మాకు అప్పగించినప్పుడు, అది దేవుడికి సేవ చేసే అరుదైన అవకాశంగా భావించాం. ఇంత భారీ తలుపులను నిర్మించడం మా బృందానికి ఇంజినీరింగ్ పరంగా గొప్ప విజయంగా, ఆధ్యాత్మికంగా గౌరవంగా నిలిచింది" అని తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతంగా పూర్తికావడానికి సహకరించిన మై హోమ్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావుకి, ఆలయ నిర్వాహకులకు శారీఖ్ అబ్దుల్ కృతజ్ఞతలు తెలిపారు.

**ఆక్సెస్ టఫ్ డోర్స్ గురించి..** ఆక్సెస్ టఫ్ డోర్స్ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక తయారీ సంస్థ. ఇది ఉక్కు తలుపులు, మెటల్ తలుపులు, కిటికీలు, పార్టిషన్లు, పోర్టబుల్ కేబిన్లు వంటి ఉత్ప త్తులను నివాస, వాణిజ్య, పారిశ్రామిక అవసరాల కోసం తయారు చేస్తుంది. ఈ సంస్థ 2006లో స్థాపించబడింది. దేశవ్యాప్తంగా, విదేశాల్లోని వినియోగదారులకు సేవలు అందిస్తోంది. సెక్యూరిటీ స్టీల్ తలుపులు, ఫైర్ రేటెడ్ తలుపులు, అల్యూమినియం కిటికీలు, మెటల్ కిటికీలు వంటి ఉత్పత్తులను ఆధునిక సాంకేతికతతో తయారు చేస్తుంది. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక డిజైన్ పరిష్కారాలు, ప్రొఫెషనల్ ఇన్‌స్టాలేషన్ సేవలు అందించడం ఈ సంస్థ ప్రత్యేకత. టోల్ ఫ్రీ నంబర్: 07075734476, వెబ్‌సైట్లు: www.aacesstoughdoors.com, www.aacesstoughdoors.in

# రేషన్ బియ్యం దోపిడీ దారులంతా దేవినేని అవినాష్ అనుచరులే

**జగన్ పేటిఎం బ్యాచ్ అధ్యక్షుడు దేవినేని అవినాష్ కన్ఫ్యూజన్‌కు కేరాఫ్ అడ్రస్**

**మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేసినా గెలవలేదనే తికమకలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు**

**రేషన్ బియ్యంను దోచుకుంటున్న అయితా కిషోర్ సహా అందరూ దేవినేని అవినాష్ అనుచరులే**

**కార్పొరేటర్‌గా కూడా గెలవలేని దేవినేని అవినాష్‌కు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను విమర్శించే స్థాయి లేదు**

**విజయవాడ నగర అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ కేశినేని చిన్నిపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదు**



**విజయవాడ మేజర్ న్యూస్ :** రేషన్ బియ్యం దోపిడీదారులంతా వైఎస్ఆర్సిపి నాయకుడు దేవినేని అవినాష్ అనుచరులేనని టిడిపి ఎస్సీ, బీసీ, మైనార్టీ విభాగాల నాయకులు అన్నారు. జగన్ పేటిఎం బ్యాచ్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ కన్ఫ్యూజన్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారాడని ఎద్దేవా చేశారు. వైసిపి ప్రభుత్వ పాలనలో మట్టి, పేకాటల ద్వారా అక్రమార్జనకు అలవాటు పడిన దేవినేని అవినాష్‌కు ఎంపీ అంటే కూడా అర్ధం తెలియడం లేదన్నారు. ఎంపీ అంటే ప్రజల చేత ఎన్నుకోబడే పార్లమెంటు సభ్యులు అని, మూడు సార్లు ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన అవినాష్‌కు ఎంపీ అంటే ఏంటో కూడా తెలియక పోవడంలో ఆశ్చర్యం లేదన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ విజయవాడ పార్లమెంటు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిడిపి మైనార్టీ సెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్ కరీముల్లా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సొంగా సంజయ్ వర్మ, టీఎనఎసఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్ మాట్లాడారు. విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని)ను ఉద్దేశించి దేవినేని అవినాష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ముందుగా ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్ కె కరీముల్లా మాట్లాడుతూ...కనీసం కార్పొరేటర్ గా కూడా గెలవని వైసీపీ నాయకుడు అవినాష్ కు ఎంపీ స్థాయి అంటే తెలియకపోవడంలో ఆశ్చర్యం లేదన్నారు. ఎంపీ అంటే మట్టి, పేకాట అనుకుంటున్నాడనీ, బియ్యం మాఫియా, మట్టి మాఫియా వైసిపి హయాంలో చేసి అదే అలవాటుగా అవినాష్ మాట్లాడుతున్నాడన్నారు. దేవినేని అవినాష్ అనుచరుడు అయితా కృష్ణ కిషోర్ బియ్యం మాఫియా చేస్తాడని విజయవాడ మొత్తం తెలుసు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా అయితా కిషోర్ ప్రస్తుతం వైసీపీ నాయకుడు అవినాష్ తో పాటే ఉంటున్నాడన్నారు. దేవినేని అవినాష్‌తో కలసి అయితా కిషోర్ కలిసి ఉన్న ఫొటోలను మీడియాకు చూపించారు. దౌర్జన్యాలు దోపిడీకి మారుపేరు దేవినేని అవినాష్ కుటుంబం అన్నారు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అవినాష్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడనీ, విజయవాడ నగర అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఎంపీ కేశినేని చిన్నిపై ఆరోపణలు చేస్తున్నాడన్నారు. వైసిపి జగన్ దగ్గర మెప్పు పొందాలంటే ప్రజాసేవ చేయాలని అవినాష్ ఇప్పటికైనా తెలుసుకోవాలని, ఇతరుల మీద ఆరోపణలు చేస్తే ప్రజల్లో మెప్పు పొందటం సాధ్యపడదన్నారు.

పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో నిరంతర ప్రజా సేవ చేస్తున్న నాయకుడు ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. 2029 ఎన్నికల్లో సైతం ప్రజాభిమానం ఉన్న ఎంపీ చిన్నిని ఢీకొట్టటం అవినాష్ వల్ల కాదని గ్రహించాలన్నారు. ప్రజా నాయకుడుగా ఉన్న ఎంపీ కేశినేని చిన్నిపై ఆరోపణలు చేస్తే అవినాష్ కే కాకుండా, వైసీపీకి కూడా రానున్న కాలంలో నష్టం తప్పదన్నారు. టి ఎన్ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్ మాట్లాడుతూ....విజయవాడ నగర అభివృద్ధికి వైసిపి అడ్డంకిగా మారిందన్నారు. తాడేపల్లి ప్యాలెస్ లో కూర్చొని జగన్ పేటిఎం బ్యాచ్ జిల్లా అధ్యక్షుడుగా దేవినేని అవినాష్, ఆ పార్టీ చెంచాలు విజయవాడ నగర అభివృద్ధి గురించి మాట్లాడతారా? అంటూ ప్రశ్నించారు. విజయవాడ నగర అభివృద్ధిపై చర్చించే దమ్ము వైసిపి నాయకులకు ఉందా? అన్నారు. విజయవాడ నగరంలో దేవినేని అవినాష్ కుటుంబ దోపిడీలు, కబ్జాలు, దౌర్జన్యాలు అందరికీ తెలుసనని, ఏలూరు రోడ్డులో దౌర్జన్యంగా అవినాష్ కుటుంబం లాక్కున్న ఇతరుల ఆస్తులు అనేకం ఉన్నాయన్నారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, బెస్ట్ ప్రైస్, తన ఇంటి వెనక ఉన్న స్కూల్ ను కూడా కబ్జా చేసిన ఘనులు అవినాష్ కుటుంబ సభ్యులు అన్నారు. చిన్ననాటి నుంచి కష్టపడి, అనేక వ్యాపారాలు చేసి డబ్బు సంపాదించుకున్న నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తన సొంత గడ్డ విజయవాడలో ప్రజా సేవ చేసేందుకు ముందుకు వచ్చి ఎంపీగా 2.80 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచిన ప్రజా నాయకులు కేశినేని చిన్ని అని, తనను ఘన మెజార్టీతో గెలిపించిన ప్రజలకు నిస్వార్ధ సేవ సేవ చేస్తున్న నాయకుడు ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఎన్ఐఆర్ డి ద్వారా తన సొంత నిధులు ఖర్చుచేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయ సాధనకు మహిళా అభ్యున్నతికి, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను మూసివేస్తే తన సొంత డబ్బులతో మొబైల్ అన్నా క్యాంటీన్లను నిర్వహించి పేదల ఆకలి తెచ్చిన నాయకుడు ఎంపీ కేశినేని చిన్ని అని అన్నారు. విజయవాడలో దసరా ఉత్సవాలలో విజయవాడ ఉత్సవ్ ను ప్రజా ప్రతినిధులను కలుపుకుని విజయవంతంగా నిర్వహించి ప్రపంచ వ్యాప్త గుర్తింపు వచ్చేలా చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కనీసం కార్పొరేటర్ గా కూడా గెలవని దేవినేని అవినాష్ కు ప్రజా నాయకుడు ఎంపీ కేశినేని చిన్ని గురించి ఏం తెలుసు? అని ప్రశ్నించారు. కన్ఫ్యూజన్ కింగ్ గా జగన్ చేత కూడా అనిపించుకున్న నాయకుడు అవినాష్ అని, దేవినేని అవినాష్ అంటే (డీఎ) డిపార్చర్, ఎరైవల్ అని జగన్ కూడా అనుకుంటున్నాడన్నారు. జగన్ విజయవాడ వచ్చినప్పుడు రిసీవ్ చేసుకోవటం, తిరిగి పంపడానికే అవినాష్ పనికి వస్తాడు తప్ప ప్రజాభిమానంను పొందలేడన్నారు. విజయవాడ పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాల పేర్లు అవినాష్ తడబడకుండా చెప్పలేడన్నారు. ప్రజల చేత బారీ మెజార్టీతో ఎన్నుకోబడిన సింహం, విజయవాడ అభివృద్ధి అంటే కేశినేని చిన్ని అని అన్నారు. కేవలం తాను గ్రామ సింహం... మాత్రమే అని అవినాష్ గుర్తుంచుకోవాలన్నారు. టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ మాట్లాడుతూ...విజయవాడలో శరీరపరంగా ఎదిగిన చంటోడు దేవినేని అవినాష్ అన్నారు. మూడుసార్లు ఎన్నికల్లో పోటీ చేసి కనీసం గెలవక పోయేటప్పటికి కన్ఫ్యూజన్లో ఉన్నాడని, తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న నక్క... విజయవాడలో ఉన్న నువ్వు విజయవాడ అభివృద్ధి గురించి మాట్లాడటమా.. అవినాష్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ నగర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు కేశినేని చిన్ని అని, మహిళలు అన్నా అని సంబోధించే నాయకులు ఎంపీ కేశినేని చిన్ని అని తెలిపారు. వైసిపి ప్రభుత్వ పాలనలో తాను ఉంటున్న గుణదల ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేసుకోలేకపోయాడన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో గుణదల రైల్వే స్టేషన్ సాటిలైట్ స్టేషన్‌గా మారిందన్నారు. విజయవాడ నగరంను గ్రేటర్ విజయవాడ గా చేసేందుకు ఎంపీ కేశినేని చిన్ని విశేష కృషి చేస్తున్నారన్నారు. రాజధాని అమరావతి ప్రాంతంతోపాటుగా విజయవాడలో కూడా అభివృద్ధి చేస్తున్నారన్నారు. విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని చిన్ని కాలి గోటికి కూడా మీ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి సరిపోడని అన్నారు. దోచుకుని, దాచుకుని తినే దేవినేని అవినాష్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. ఎంపీ కేశినేని చిన్ని గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే వైసీపీ నాయకుల నాలుకలు కోస్తాం అంటూ హెచ్చరించారు. ప్రతిపక్షాలుగా విజయవాడ నగర అభివృద్ధి కి కలిసి రావాలని, అంతేకానీ దేవినేని అవినాష్ లాగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. ముందు కార్పొరేటర్ గా అయినా... మా మైనార్టీ నాయకుడు కరీముల్లా పై గెలిచి ఆ తర్వాత తడబడకుండా విజయవాడ నగర అభివృద్ధి గురించి మాట్లాడాలని అవినాష్ కు హితవు పలికారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు వి.వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఐనపూరు జడ్పీ హైస్కూల్ ను సందర్శించిన రాష్ట్ర కైవల్య ఫౌండేషన్ టీమ్







**పమిడిముక్కల మేజర్ న్యూస్:** పాఠశాలల స్కూల్ హెడ్స్ అందరూ స్కూల్ లీడర్ షిప్ ట్రైనింగ్ ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర కైవల్య ఫౌండేషన్ టీమ్ డైరెక్టర్ విజేత శ్రీవత్సవ ఆకాంక్షించారు. బుధవారం రాష్ట్ర కైవల్య ఫౌండేషన్ టీమ్ సభ్యులు ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, వివిధ అంశాలపై, ఆచరించదగిన ఉత్తమ పద్ధతులపై, స్కూల్ లీడర్ షిప్ ట్రైనింగ్ ప్రభావం ఎంతవరకు ఉపయోగపడుతుందనే విషయాలను పరిశీలించారు. పాఠశాల అసెంబ్లీ సమయానికే పాఠశాలను సందర్శించిన రాష్ట్ర కైవల్య టీమ్ ఫౌండేషన్ సభ్యులు, అసెంబ్లీ నిర్వహించిన తీరును గమనించి, అన్ని రకాలుగా బాగుందని ప్రశంసించారు. ఈసందర్భంగా టీమ్ డైరెక్టర్ విజేత శ్రీవత్సవ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే అవి పాఠశాల పరిపాలన, నిర్ణయాత్మక విధానాలు పాఠశాల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయని సూచించారు. మారుతున్న సమాజ పరిస్థితులను బట్టి, స్కూల్ హెడ్స్ కూడా మార్పుకు అనుగుణంగా మార్పు చెందుతూ, తదనుగుణంగా స్పందిస్తూ, మానవ సంబంధాలను పెంపొందించుకుంటూ, విద్యార్థుల తల్లిదండ్రులతో స్నేహభావంతో కూడిన సత్సంబంధాలను పెంపొందించుకుంటూ, వాటి ద్వారా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు గత మూడు సంవత్సరాల నుండి స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్ కార్యక్రమాలకు కృష్ణాజిల్లా సంబంధించిన రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తూ అనేకమంది స్కూల్ హెడ్స్‌కు శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో, రాష్ట్ర కైవల్య ఫౌండేషన్ టీమ్ వివిధ అంశాల పైన ప్రధానోపాధ్యాయులు వేణును ఇంటర్వ్యూ చేయడం ద్వారా పాఠశాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లడానికి వేణు అవలంబిస్తున్న అనేక పద్ధతులను, అమలు తీరును అడిగి తెలుసుకుని, వాటి అమలు ద్వారా పాఠశాల అభివృద్ధి చేస్తున్న తీరును నిశితంగా పరిశీలించి, పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నారని, ఉపాధ్యాయులందరినీ సమన్వయం చేసుకుంటూ పాఠశాల ఎస్ఎంసి కమిటీ సభ్యులు, దాతల సహకారంతో పాఠశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారని, ప్రధానోపాధ్యాయులు వేణును ప్రశంసించారు. పదవ తరగతి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. పబ్లిక్ పరీక్షలను రాయడానికి విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని ఏవిధంగా అధిగమించాలో తెలియజేశారు. ప్రతిరోజు కొంత సమయం మెడిటేషన్, ధ్యానము, యోగా, వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చని, మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలియజేశారు. తద్వారా పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా రాయడమే కాకుండా, అనుకున్న లక్ష్యాన్ని కూడా సాధిస్తారని తెలిపార. ఈకార్యక్రమంలో టీమ్ డైరెక్టర్ విజేత శ్రీవత్సవ తో పాటుగా, సీనియర్ ప్రోగ్రామ్ లీడర్లు కంటే శైలజ, వి.నరసింహమూర్తి కూడా పాల్గొని వివిధ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, పాఠశాల అభివృద్ధికి తీసుకోవలసిన అనేక చర్యలపై తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో టీమ్ సభ్యులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ నేతలు

## సంయమనం పాటించాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో గడచిన రెండు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలపై తెలుగుదేశం పార్టీ నేతలు సంయమనంతో వ్యవహరించాలని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోడూరు మండలంలో పనుల కేటాయింపులో ఏర్పడిన అభిప్రాయ భేదాల నేపథ్యంలో తెలుగుదేశం - జనసేన పార్టీల నేతలు బహిరంగంగా విమర్శలు చేసుకోవడంతో చిన్న విషయం పెద్దదైందని, ఇది కూటమి ఐక్యతకు భంగం కలిగించే అంశమని అన్నారు. పదవులు, పనులు కేటాయింపు విషయంలో కూటమిలోని మూడు పార్టీల అగ్ర నేతలు త్వరలో ఒక నిర్ణయం తీసుకోనున్నారని ఆయన తెలిపారు. అందరికీ తగిన న్యాయం జరిగేలా ఇరుపార్టీల అధిష్టానం పనిచేస్తున్నాయని, ఇకపై ఎవరూ ఏ విషయంపైనైనా బహిరంగ విమర్శలు, ప్రకటనలు చేయడం గానీ సామాజిక మాధ్యమాల్లో వివాదాస్పద పోస్టులు పెట్టడం గానీ చేయవద్దని కనపర్తి శ్రీనివాసరావు సూచించారు. త్వరలో నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరగనుందని తెలిపారు.

## ప్యాన్ ఇండియన్ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానుల సమావేశం



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్యాన్ ఇండియన్ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానుల సమావేశం బుధవారం విజయవాడలో ఘనంగా నిర్వహించారు. తమ హీరో పేరిట పలు సేవా కార్యక్రమాలు, సమాజానికి కావలసిన అవసరతలకు అనుగుణంగా సేవాతాత్పర్యంతో మెలుగుటకు ఒక జట్టుగా ముందుకు వెళ్ళడానికి ఈ అభిమానుల సమావేశం ఏర్పర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాలకు గాను జిల్లా అధ్యక్షులను, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. గుంటూరు జిల్లాకు గాను ప్రెసిడెంటుగా గుజ్జర్లపుడి బాబీను, వైస్ ప్రెసిడెంట్లుగా పసుపులేటి నాగరాజు, పల్లపోతూ వంశీ కృష్ణాలను నియమించారు. కాగా ఆంధ్రా ప్రదేశ్ స్టేట్ కమిటీలో కూడా గుంటూరు జిల్లాకు చెందిన షేక్ బాషాని ఎఎఎఫ్ఎ (అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్) స్టేట్ వైస్ ప్రెసిడెంటుగా, కొయ్యగూర విలియంని ఎఎఎఫ్ఎ స్టేట్ సెక్రటరీగా నియమించడం జరిగింది. కార్యక్రమంలో తదుపరి జిల్లా సెక్రటరీలను, జాయింట్ సెక్రటరీలను నియమించారు. ఈ సమావేశంనకు రాష్ట్ర అధ్యక్షులు కునపూరెడ్డి శివ శంకర్, పరిశీలకులు చవటపల్లి ధర్మేంద్ర, ఇంచార్జీ అర్జున్ కుమార్ హాజరు కావడం జరిగింది.



## సర్వరోగ నివారణకు వ్యాయామం ఒక్కటే మార్గం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సర్వరోగ నివారణకు వ్యాయామం ఒక్కటే మార్గమని కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు తెలిపారు. బుధవారం కృష్ణా యూనివర్సిటీ థైక్వాండో జట్లను ఎంపిక చేశారు. నేటి కాలమాన పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ కనీసం రోజులో 35 నిమిషాలు వ్యాయామం చేయడం అత్యంత ఆవశ్యకం అన్నారు. అలా చేయకపోతే ఎన్ని లక్షలు ఉన్నా ఎవరు కాపాడలేరని డాక్టర్ రాంబాబు తెలిపారు. విశ్వవిద్యాలయ ఇండోర్ స్టేడియంలో అంతర్ విశ్వవిద్యాలయ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు, కృష్ణా విశ్వవిద్యాలయం జట్టు ఎంపిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులే నిజమైన ఆరోగ్యవంతులు అని,వారిని చూసి తమ జీవన విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. తదుపరి కృష్ణా విశ్వవిద్యాలయ జట్టును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.గోపి, తైక్వాండో రిఫరీ లు, పలు కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

## నిడుమోలు పీ.హెచ్.సిలో హెచ్.పి.వి.శిబిరం



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నిడుమోలు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో బుధవారం కిషోర్ బాలికల (14) కు గర్భాశయ ముఖద్వారము క్యాన్సర్ ప్రవేశించకుండా హెచ్.పి.వి. వ్యాక్సిన్ వేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కొమరగిరి అంజలి ప్రారంభించగా.పి.హెచ్.సి. వైద్యాధికారులు డాక్టర్ ఏ. సాయికుమార్, డాక్టర్ కే. విజయ్ కుమార్ లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మహిళలలో గర్భాశయముఖద్వారం క్యాన్సర్ వచ్చే అవకాశాలు 99 శాతం ఉన్నాయని ఇది రాకుండా ముందు జాగ్రత్త చర్యగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని14 సంవత్సరాల నుంచి బాలికలకు హెచ్.పి.వి. వ్యాక్సిన్ ఉచితంగా వేయనున్నట్లు వివరించారు. ఈ శిబిరంలో ఎం.పీ.హెచ్.ఇ. ఓ.వి.శివప్రసాద్,సూపర్వైజర్లు కెవిఎస్ శంకరరావు, పి.విజయ కుమారి, ఎం పి హెచ్ ఎ (ఎఫ్.) బి.వి. నాగమణి, వి.హెచ్.ఎస్. కే మేరీ మాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడ్డం రాజు ఆధ్వర్యంలో శిబిరాన్ని సందర్శించిన బండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం కోనేరు సెంటర్లో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రియాశీలక సభ్యత నమోదు కేంద్రాన్ని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ చైర్మన్ బండిరామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత నమోదు గడువు పెరిగిందని జనసేన పార్టీ నాయకులు కీలక పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరు సభ్యత నమోదు బాధ్యతగా చేయించాలని పేర్కొన్నారు. ఈనెల 17 వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కొనసాగుతుందని తెలిపారు. జనసేన పార్టీ సభ్యత్వం కొరకు కోనేరు సెంటర్లో నగర అధ్యక్షుడు గడ్డంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సంప్రదించాలని 400 రూపాయల సభ్యత్వంతో 5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు పార్టీలకు అతీతంగా మచిలీపట్నం ప్రజలందరూ సభ్యత్వాన్ని పొంది5 లక్షల బీమా తో కుటుంబానికి రక్షణ పొంద వచ్చని అన్నారు. సభ్యత్వ నమోదుకు ఆధార్ నామిని ఆధార్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో 400 రూపాయలతో ప్రతి ఒక్కరు సభ్యత్వం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు,పినిశెట్టివేణు,హేమశ్రీ, రామ్ జ్యోతి, వడ్డీచిరంజీవి, మహేష్,కోటి,,కృష్ణ, వీరబాబు, సాయి కృష్ణ, రమేష్, గణేష్,యేసు,ఉడుముల బుజ్జి, వీరబాబు,సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## కరుణాకరరావు మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో కూచిపూడి కరుణాకరరావు మరణించగా బుధవారం పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కరుణాకర రావు అంతిమయాత్రలో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘంటా సురేష్, చాట్ల రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుబ్బారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రు టౌన్‌లో బుధవారం జరిగిన బొమ్మారెడ్డి సుబ్బారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారితో కొద్దిసేపు ఎమ్మెల్యే కుమార్ రాజా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కావూరి మృతికి బుద్ధప్రసాద్ సంతాపం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు మరణం పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన రాజకీయ ఉన్నతికి తోడ్పడిన వారిలో ప్రథములు కావూరి సాంబశివరావు అని తెలిపారు. తాను జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి అధిష్టించడంలో వారి పాత్ర ప్రాముఖ్యమైనదన్నారు. తన తండ్రి మండలి వెంకట కృష్ణారావుకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, వారి మెడ్విన్ ఆసుపత్రిలో చికిత్స చేయించారని, అక్కడే కృష్ణారావు తుదిశ్వాస విడిచారని బుద్ధప్రసాద్ గుర్తు చేసుకున్నారు. అవనిగడ్డలో ఏ కార్యక్రమం జరిగినా సాంబశివరావు వచ్చేవారని, అనారోగ్యంతో ఉన్నప్పటికీ, తన కుమారుడు వెంకట్రామ్ వివాహానికి వచ్చారని తెలిపారు. తన పట్ల కావూరి చూపిన ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. కావూరి మృతితో తాను ఒక హితైషిని కోల్పోయినట్లు తెలిపారు. ఆత్మ శాంతి కలగాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకుప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వీరాంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

పామర్రు మేజర్ న్యూస్: మండల పరిధిలోని ఉండ్రపూడి – పోలవరం అడ్డ రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానము



హుండీలు లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ లెక్కింపులో 102 రోజులకు గాను 8,14,566 రూపాయలు ఆదాయం వచ్చింది. గుడ్లవల్లేరు గ్రూపు దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటప్పయ్య పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తాడిశెట్టి వెంకటేశ్వరావు, ధర్మకర్తలు చిల్లర వీర సాంబశివరావు, ఈడే ఘంటేశ్వరావు, యార్లగడ్డ రమేష్ బాబు,నల్లూరి నాంచారమ్మ, వి.రామకృష్ణ, దాడి నీరజ్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.వి.ఎస్.వి.ప్రసాదరావు, సేవా కమిటీ సభ్యులు హుండీ లెక్కింపు లో పాల్గొన్నారు.

# హజ్రత్ అలీ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు





## చెస్ట్ బీటింగ్ కార్యక్రమం నిర్వహించిన ముస్లింలు



పమిడిముక్కల మేజర్ న్యూస్ : పవిత్ర రంజాన్ మాసంలో 21వ రోజు హజ్రత్ అలీ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని అలినఖిపాలెం లో ముస్లిం సోదరులు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసం 19వ రోజున నమాజులో ఉన్న హజ్రత్ అలీ తలపై విషపూరిత కత్తితో దాడి జరుగుగా 21వ రోజున ఆయన మృతి చెందినట్లు ముస్లిం మత గురువులు పేర్కొంటారు. ఈ విషాదగాధను స్మరించుకుంటూ షియా ముస్లింలు నౌహ అనే ప్రత్యేక దుఃఖ గీతాలను ఆలపిస్తూ పీర్ల గుమ్మటాన్ని గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా పాత పీర్ల పంజా వద్ద ముస్లింలు చెస్ట్ బీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా చెస్ట్ బీటింగ్ సందర్భంగా గాయాలైన వారికి ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రాథమిక చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా పమిడిముక్కల ఎస్ఐ బి.శ్రీను ఆధ్వర్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

## ఏఏబిఎస్‌టిఏ దర్బార్‌లో 21వ రోజు ఇఫ్తార్ విందు



**ఏ కొండూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని చీమలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దివ్య ఆశీస్సులతో జంపని గ్రామంలో ఉన్న ఏ ఏ బి ఎస్ టి ఏ దర్బార్ పీఠాధిపతి అత మొహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరి బాబా (నిజాం బాబా) వారి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు 21వ రోజు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిజాం బాబా మాట్లాడుతూ చీమలపాడు బాబా వారి దివ్య ఆశీస్సులతో ఇంతటి మహత్తరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రంజాన్ మాసం ప్రారంభం నుండి ఈరోజు 21వ ఉపవాసం వరకు 21వ రోజు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. 30 రోజులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపవాస దీక్ష పరులతో పాటు కులమతాలకు అతీతంగా అందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రంజాన్ మాసంలో తన వంతు సహాయ సహకారాలు నిరుపేదలకు అందిస్తున్నట్లు తెలిపారు. మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ భగవంతునికి చేరువ కావాలన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ





**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** బీఆర్టీఎస్ రోడ్డులోని టి. వెంకటేశ్వరరావు మున్సిపల్ హై స్కూల్‌లో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సందర్భంగా అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్స్ బాక్సులు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్ధ, బొండా రవితేజ గార్ల సహకారంతో సెంట్రల్ నియోజకవర్గం ఎస్సీ సెల్, తెలుగు యువత ఆధ్వర్యంలో సుమారు 110 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు హాజరై విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్స్ బాక్సులు అందజేసి వారిని ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు రస్నా పంపిణీ చేసి, రాబోయే పదవ తరగతి పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచిస్తూ ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూసెంట్రల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. గత సంవత్సరంలో కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఏకేటిపి పాఠశాల విద్యార్థి గత సంవత్సరం అత్యధిక మార్కులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎటువంటి భయాలు లేకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, సమయపాలన పాటిస్తూ మంచి మార్కులు సాధించాలని సూచించారు. విద్య అనేది భవిష్యత్తును నిర్మించే శక్తి అని, చదువు ద్వారా మాత్రమే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, విద్యార్థులు ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధిస్తే తల్లిదండ్రులకు, గురువులకు మాత్రమే కాకుండా పాఠశాలకు, సెంట్రల్ నియోజకవర్గానికి కూడా మంచి పేరు తీసుకువస్తారని తెలిపారు. పరీక్షలను ఒత్తిడిగా భావించకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని విజయాన్ని సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలోటిడిపి రాష్ట్ర కార్యదర్శి, డివిజన్ ఇంచార్జ్ నవనీతం సాంబశివరావు, డివిజన్ అధ్యక్షులు దాసరి జయరాజు, సెక్రటరీ మల్లంపల్లి సురేష్, షేక్ జాన్ వలి, కేఎస్టీ కుమార్, మాచర్ల ఉదయ్ కుమార్, ఆలేటి వినయ్, నవిలా అశోక్, షేక్ దావూద్, గండి రాజా, గుండు ఆకాష్ తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో యల్.బి.ఆర్.సి.ఈ విద్యార్థుల ప్రతిభ



మైలవరం, మేజర్ న్యూస్ : ఒంగోలులోని ఆంధ్రా కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో మార్చి 7,8 తేదీల్లో నిర్వహించిన 15వ ఏపీ స్టేట్ సీనియర్స్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్2026 పోటీలలో ఎన్.టి.ఆర్ జిల్లా జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి మూడవ స్థానం సాధించింది. ఈ జట్టులోలకి రెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనడం విశేషం. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరచడానికి కాలేజ్ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ఈ విజయంపై కాలేజ్ ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు ఆనందం వ్యక్తం చేస్తూ జట్టు సభ్యులను అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విజయాలు సాధించడం కాలేజ్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.ఎన్.వి.రాజ్ కుమార్ విద్యార్థులకు క్రీడలలో నిరంతరం శిక్షణ, ప్రోత్సాహం అందిస్తూ వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నారని కాలేజ్ యాజమాన్యం ప్రశంసించింది. ఆయన మార్గదర్శకత్వంలోనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. జట్టు సభ్యులుగా ఆర్. సుజిత్ కుమార్ రెడ్డి (ఈ సి ఈ), బి. నటరాజు, వై. అఖిల్ (ఎం ఇ సి హెచ్), బి. వినోద్ కుమార్, ఎస్‌కే. జాన్ బాష్, ఎన్. రోహిత్ కెవిన్, ఎ. సాయి కిరణ్ రెడ్డి (సి ఎస్ ఈ), టి. అరవింద్ (ఐటి) తదితరులు పాల్గొని అద్భుత ప్రదర్శనతో జిల్లాకు గౌరవం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు విజేతలైన జట్టును అభినందించి ట్రోఫీని అందజేశారు.

# పంచాయతీరాజ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష

పామర్రు మేజర్ న్యూస్ : పామర్రు టౌన్ పి-4 కార్యాలయంలో పంచాయ తీరాజ్ డిఇఇ, మండల పరిధిలోని ఏఈ లతో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటి వరకు జరిగిన పనుల పైన వివరణ తీసుకోవ డంతోపాటు ఇంకా చేయవలిసిన పనులపై సమీక్ష చేశారు. అలాగే జరుగు తున్న పనులపైన సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ముఖ్యమైన రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, స్కూల్ బిల్డింగ్స్, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాల పైన సమీక్ష జరిపారు. రాబోవు కాలంలో ఇంకా చేయవలిసిన, మిగిలిన పనుల వివరాలు, వాటికి కావలిసిన గ్రాంట్స్, బడ్జెట్ గురించి చర్చించారు. ప్రజలకు ముఖ్యమైన రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, స్కూల్ భవనాలు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలు ముందుగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాబోయే కాలంలో మిగిలిన అభివృద్ధి పనులకు అవసరమైన గ్రాంట్లు, బడ్జెట్ కేటాయింపులపై ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, అసెంబ్లీలో సమస్యలు సమగ్రంగా చర్చించామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



పంచాయతీరాజ్ అధికారులు వేగంగా పనులు పూర్తి చేసి, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ డిఇఇ పి.సురేష్ బాబు, బి.రామారావు, డి.రామమోహనరావు, కె.శరాబందిరాజు, రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**రూ.40 లక్షలతో డ్రైనేజీ పనులకు శ్రీకారం,**

**పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం**

**సెంట్రల్ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం**

**ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు**

విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ : బుధవారం సెంట్రల్ నియోజకవర్గం లోని 25వ డివిజన్ దుర్గ అగ్రహారం, అంకమ్మ తల్లి గుడి అయ్యన్న నాయుడు వీధిలో నూతన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజలు తమను ఎమ్మెల్యేగా ఆశీర్వదించిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తున్నామ ని తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను గుర్తించి ఒక్కొక్కటిగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని... గత 20 నెలల కాలంలో సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.300 కోట్లకు పైగా నిధులు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు, నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారులతో చర్చించి వెంటనే నిధులు కేటాయించి టెండర్లు పిలిపించి పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని... అయ్యన్న నాయుడు వీధిలో అనేక సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వ కాలంలో నాసిరకం పనులు చేయడం వల్ల డ్రైనేజీ తరచుగా బ్లాక్ అవుతూ ప్రాంత వాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు, స్థానిక డివిజన్ పార్టీ నాయకులు ఈ సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి రూ.40 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులకు, మరో రూ.20 లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్, పంపుల పనులకు ఆమోదం తెలిపినట్లు... నియోజకవర్గంలోని ప్రతి రోడ్డులో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను తెలియజేయాలని కోరారు, ప్రజలు ఒక చిన్న అర్జీ సమర్పించినా ఎమ్మెల్యే కార్యాలయం బాధ్యతగా స్పందించి అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.. ఈ నిరంతర అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సెంట్రల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని తెలియజేశారు... ఈ కార్యక్రమంలోమహిళా నాయకురాలు మాచర్ల పావని,సామ్రాజ్యం,డివిజన్ అధ్యక్షుడు మాచర్ల గోపినాథ్,ప్రధాన కార్యదర్శి ఇనుకుల. సాయిబాబు,సుబ్బారావు, దొంగర.ఆంజనేయులు, దుర్గరావు,బాడీత. సురేష్,సిరిదీప్,కళ్యాణ్,కృష్ణ,గిరి,విజయ్, శాంసన్,ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు..



## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పామర్రు మేజర్ న్యూస్ : పామర్రులోని పి-4 కార్యాలయంలో బుధవారం సాయంత్రం స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామానికి చెందిన గంధ్రప్ప ప్రవీణ్ కుమార్ కు 37,500 రూపాయలు, అలాగే అయ్యంకి గ్రామానికి చెందిన ఆరేపల్లి దిలీప్ రామ్ కుమార్ కు 95,734 రూపాయలు వంతున మంజూరైన చెక్కులను ఆయన స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, అయ్యంకి పిఏసిఎస్ అధ్యక్షులు రాజులపాటి పెదమస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి వాక్సినేషన్ ప్రారంభం



ఘంటసాల, మేజర్ న్యూస్: ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పి వివాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), గ్రామ సర్పంచ్ ముప్పానేని రవిప్రసాద్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లల్లో వచ్చే సెర్వికల్ క్యాన్సర్ ముప్పును తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా 1415 సంవత్సరాల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాలను అందిస్తు న్నట్లు తెలిపారు. శ్రీకాకుళం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 50 మంది బాలికలకు ఈ టీకాలను విజయవంతంగా అందించినట్లు వెల్లడించారు. ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, జనసేన పార్టీ నాయకులు కొండవీటి నాని, ఆసుపత్రి వైద్యులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


## హెచ్‌పివి వాక్సినేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : మండలంలో హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కౌతవరం పీహెచ్ సీని సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సాగునీటి బీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్షర ఆంధ్ర పై అవగాహన






ఘంటసాల, మేజర్ న్యూస్: మండల కేంద్రమైన ఘంటసాల మండల ప్రజా పరిషత్ ఆఫీస్‌లో అక్షరాంధ్ర పై ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లతో అక్షరాంధ్రకు పై అవగాహన నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో డి సుబ్బారావు బుధవారం తెలిపారు. నిరక్షరాస్యులైన పురుషులు సంఖ్య 600 మంది గాను, మహిళలు 1100 ఉన్నట్లు తేలిందని వారికి ఆదివారం 15 న అన్ని అంగన్వాడీ సెంటర్ ల లో పరీక్ష నిర్వహించాల్సిందిగా తెలపడం జరిగిందన్నారు. 1700 మందికి వాలంటీర్స్ టీచర్స్ గా వున్న వి వో ఏ లు, ఎఫ్ ఎ లు, యాక్టీవ్ మెట్లు, యాక్టివ్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ మెంబెర్ లు, 1700 మంది లెరనర్స్ కు పరీక్ష కండక్ట్ చేర్యాలని తెలిపారు వి ఈ ఏ లు రిజల్ట్ షీట్ ను వారి లాగిన్ లో అప్లోడ్ చేయాలని ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు.

# ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాల ఏర్పాటు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు





**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** సెంట్రల్ నియోజకవర్గంలోని 31వ డివిజన్ ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ సెంటర్ వద్ద విజయవాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు బుధవారం ఉదయం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పాదచారులు, వాహనదారులకు చల్లటి మంచినీటిని అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వేసవి కాలంలో తీవ్ర ఎండల కారణంగా అసంఘటిత కార్మికులు, రోడ్లపై పని చేసే కూలీలు, ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, ప్రయాణికులు, మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. అందుకే ప్రతి సంవత్సరం ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, పార్టీ కార్యకర్తల సహకారంతో పాటు స్వంత నిధులతో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో మాట్లాడి సెంట్రల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కూడా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించామని... వర్షాలు పడే వరకు ఈ చలివేంద్రాలు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటాయని, అన్ని కేంద్రాల్లో చల్లటి మంచినీరు, మజ్జిగ అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అత్యవసర పనులు ఉన్నప్పుడు మాత్రమే బయటకు రావాలని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వడగాల్పుల ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ప్రజలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ త్రిమూర్తి రాజు, డివిజన్ అధ్యక్షులు గద్దం శ్రీను, ప్రధాన కార్యదర్శి రాజేష్ వర్మ, దేవరపు మాల్యాద్రి, ప్రసాద్, మురళీ కృష్ణంరాజు, సాంబశివరావు, శేషమ్మ, శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, శేఖర్, నారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలి

**వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించండి**

**డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని**



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 11, మేజర్ న్యూస్ :** వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. వైద్య ఆరోగ్య సిబ్బంది చేసిన సూచనలు పాటించాలని డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని సూచించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి సూచనల మేరకు వేసవికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా తగిన ఏర్పాట్లు చేశామని.. ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు. స్వర్ణ గ్రామం, వార్డులోనూ, చలివేంద్రాల్లోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని.. విద్యార్థులకు కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జ్వరం, విరోచనాలు, వడదెబ్బ కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నట్లు తెలిపారు. వదులుగా ఉండే లేతరంగు కాటన్ దుస్తులు ధరించడం, ఎండ తీవ్రత బారినపడకుండా టోపీ వంటివి ధరించాలన్నారు. తరచు సురక్షితమైన తాగునీటిని తాగాలని.. పుచ్చకాయ వంటి నీరు శాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవాలన్నారు. వయోవృద్ధులు, చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని సూచించారు.

# చలివేంద్రం మన సంస్కృతిని ప్రతిబింబించే ఒక గొప్ప సేవా కార్యక్రమం

**ఆర్టీసీ డిపో మేనేజర్, టీ.పెద్దిరాజు**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎండలలో చలివేంద్రాల ఏర్పాటుతో ప్రజల దాహార్తిని తీర్చడం ఎంతో పుణ్యం. ఎండల తీవ్రత దృష్ట్యా చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం. అని మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్, టీ.పెద్ది రాజు అన్నారు. ఎండల తీవ్రత రోజు రోజుకి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా 45వ డివిజన్‌కు చెందిన కీర్తిశేషులు మురాల రామాంజనేయులు జ్ఞాపకార్థం వారి స్నేహితులు మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ బస్టాండ్ సమీపంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్, టీ.పెద్దిరాజు హాజరై మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం వేసవికాలంలో అసంఘటిత కార్మికులు, రోడ్లపై పనిచేసే కూలీలు, డ్రైవర్లు, రిక్షా కార్మికులు, ప్రయాణికులు,పాదచారులు,, మహిళలు తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయి అన్నారు. కీర్తిశేషులు మురాల రామాంజనేయులు జ్ఞాపకార్థం వారి స్నేహితులు బస్టాండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయం అన్నారు. వర్షాలు పడే వరకు ఈ చలివేంద్రం బస్టాండ్ దగ్గర ప్రతిరోజు ప్రజల దాహార్తిని తీర్చే విధంగా ఉపయోగిస్తారు అన్నారు.ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండా లని సూచించారు. వడగాల్పుల ప్రభావం ఎక్కువ గా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మచిలీపట్నం నగరంలో ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చే విధంగా కృషి చేయాలని కోరారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ, చలివేంద్రం మన భారతీయ సాంప్రదాయంలో దానం, సేవాభావానికి ప్రతీక గా నిలుస్తుంది అన్నారు.దాహార్తి నివారణ అంటే దాహంతో ఉన్నవారికి నీరు ఇవ్వడం గొప్ప పుణ్యం అన్నారు. చలివేంద్రం సమాజంలో దయ, సహానుభూతి, పరస్పర సహకారం వంటి మంచి విలువలను పెంపొందిస్తుంది అన్నారు. చలివేంద్రం మన సంస్కృతిని ప్రతిబింబించే ఒక గొప్ప సేవా కార్యక్రమం, ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే సమాజంలో మానవత్వం మరింత పెరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ తో పాటుగా 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గంజాల రవికుమార్, చంద్రశేఖర్, తాత దుర్గారావు, శ్యాం కుమార్,మురాల ఖాశీ వరప్రసాద్, కోమటి వెంకటేశ్వరరావు, హన్ను, పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## బొండా ఉమాని కలిసిన ఏపీ మినిమం వేజెస్ అడ్వైజరి బోర్డు డైరెక్టర్ రెంటపల్లి శ్యామ్

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావుని ఇటీవల ఏపీ మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ డైరెక్టర్ గా ప్రభుత్వ నామినేటెడ్ పదవిలో నియమితులైన టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోన్ 3 ఇంచార్జ్ రెంటపల్లి శ్యామ్ మర్యాదపూర్వకంగా కలిశారు ఉమా రెంటపల్లి శ్యామ్ ను అభినందిస్తూ దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ రెంటపల్లి శ్యామ్ టిఎన్‌టియుసి బలోపేతం కొరకు నిరంతరం పనిచేశారని అభినందిస్తూ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దాసరి జయరాజు, కామ దేవరాజు, టి ఎన్ టి యు సి రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ లక్కీశెట్టి కనకారావు, ఎస్సీ సెల్ సెంట్రల్ నియోజవర్గం నాయకులు బెజ్జం జైపాల్, ఎస్సీ నాయకురాలు రుక్మిణి, కామ వెంకట నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో కూటమి ఎంపీల ఆత్మీయ సమావేశం

**ఎంపీ చిన్నిని ఆప్యాయంగా పలకరించిన యువ నేత, మంత్రి లోకేష్**



**న్యూఢిల్లీ/విజయవాడ, మేజర్ న్యూస్ :** దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు అందరూ బుధవారం ఆత్మీయంగా సమావేశమయ్యారు. కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు ఇంట్లో మధ్యాహ్నం జరిగిన విందులో కూటమి ఎంపీలు అందరూ పాల్గొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న విద్య, ఐటీ శాఖల మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ ఈ ఆత్మీయ సమావేశానికి హాజరై కూటమి ఎంపీలతో కలిసి సందడి చేశారు. ఎంపీలందరినీ ఆప్యాయతతో పేరుపేరునా పలకరించారు. విందుకు హాజరైన విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) సైతం మంత్రి లోకేష్ ను కలిసి కొద్దిసేపు ఆయనతో మాట్లాడారు.

## జడ్పీ హై స్కూల్‌కు ఐరన్ రాక్స్, సౌండ్ సిస్టమ్ డొనేట్



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోనల్, రీజినల్ ఆఫీసెస్ నుండి ఎంపవర్ హర్ అండ్ పవర్ హిం కమిటీ వారు సంయుక్తంగా, ఎస్సీఆర్ యాక్టివిటీ లో భాగంగా, జక్కంపూడి జడ్పీ హై స్కూల్‌లో, వారికి కావసిన ఐరన్ రాక్స్, సౌండ్ సిస్టమ్ ను డొనేట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ ఎం.వి.ఎస్ రవి శంకర్, ఏజీఎం దాస్యం శ్రీనివాస్, ఎంపవర్ హర్ కమిటీ నుండి, విజయలక్ష్మి, ప్రియాంక, రాధిక, సుధ అండ్ పూజ, పవర్ హిం కమిటీ సభ్యులు, శ్రీకాంత్ అండ్ గణేష్ పాల్గొన్నారు. విద్యార్థులకు చదువు యొక్క గొప్పతనాన్ని యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ రవిశంకర్ వివరించారు. పాఠశాల హెచ్ ఎం పద్మ పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999